క్లుప్తంగా

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు



మోర్తాడ్: మోర్తాడ్‌లో సీఎం కప్ పోటీలు కొనసాగాయి. ఈసందర్భంగా ఆదివారం ప్రతిభ చూపిన క్రీడాకారులను తదుపరి పోటీలకు ఎంపిక చేశారు. అనంతరం మోర్తాడ్ ఎంపీడీవో తిరుమల మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చి దిద్దడానికే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. మోహినోద్దీన్, ప్రభాకర్ రావు, కార్యదర్శి సైపుద్దీన్, వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, కాంగ్రెస్ నాయకులు గిర్మాజి గోపి, తక్కూరి సతీష్, పుప్పాల అశోక్, నాగభూషణం, పీడీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి పనులు ప్రారంభం



వేల్పూర్: మండలంలోని వాడి గ్రామంలో ఆదివారం బోరుబావి తవ్వకం పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి కోసం బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి రూ. 10 లక్షలు మంజూరు చేయగా, బోరుబావి తవ్వకం, పంపుసెట్‌కు రూ. 2లక్షలు, పైపులైను నిర్మాణానికి రూ.8లక్షలు కేటాయించారన్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరుతుందని, నిధులు మంజూరు చేసిన సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రెడ్డొల్ల మహేందర్, అంకం రమేశ్, బద్దం మహేందర్, అంకం రమేశ్, నాగవేణు, సాయికృష్ణ, మల్లేష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

గొట్టిముక్కలలో వైద్యశిబిరం



మాక్లూర్: మండలంలోని గొట్టిముక్కల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్, మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బీరేల్లి విజయ్‌రావు, డాక్టర్ కృష్ణమూర్తి, క్లబ్ సభ్యులు రామకృష్ణ, జుగల్‌సోనీ, రాజేశ్వర్, నర్సింగ్‌రావు, రాజ్‌కుమార్‌సుబేదార్, సతీష్, శ్రీరామ్‌సోనీ, వైద్యులు అర్వింద్, ముఖేష్, రమ్య, ఆఫ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

నీలా గ్రామంలో..



రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామంలో ఆదివారం నిజామాబాద్‌కు చెందిన లక్ష్మీ ప్రియ ఆస్పత్రి, సూర్య ఆరోగ్య సంస్థ, డీయర్ బ్రీడర్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు సంతోష్, చైతన్య, శ్రీకాంత్, సూర్య ఆరోగ్య సంస్థ ప్రతినిధి రాజేంద్ర కుమార్, ప్రతినిధులు దయాకర్‌రెడ్డి, ఎజాజ్ హైమద్, వినోద్, సమీర్, సభ్యులు సద్దాం హైమద్, మోహరాజ్, సోనూ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు తొలగించారు. అలాగే కాలనీలోని మురికికాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

నేడు ఆర్మూర్‌లో 2కే రన్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సోమవారం ఉదయం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ సహకారంతో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించడానికి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2కె రన్‌లో యువకులు పాల్గొన్నాలని వీహెచ్‌పీ సభ్యులు కోరారు.

ఆదాయంపై బల్దియా దృష్టి

- బోధన్‌లో వందశాతం పన్ను వసూళ్ల కోసం స్పెషల్‌డ్రైవ్‌!
- ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక నజర్



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బల్దియాకు ఆదాయం సమకూర్చుకునేందుకు బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా బల్దియాకు ప్రధాన ఆదాయ వనరైన ప్రాపర్టీ టాక్స్‌ను 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి 100శాతం వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలో ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే పట్టణంలో 40శాతానికి పైగా టాక్స్ వసూలు చేశారు.

మున్సిపల్ దుకాణ సముదాయాలతో..

బల్దియాకు ఆదాయం సమకూరేందుకు 27ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాతోపాటు పాత బస్టాండ్‌లోని వీక్లీ మార్కెట్‌లో సుమారు 100 దుకాణ సముదాయాలను నిర్మించింది. టెండర్ ప్రక్రియను నిర్వహించి 25ఏళ్ల లీజుకు అప్పగించారు. లీజు గడువు ముగిస్తే దుకాణాలను ఖాళీ చేయాలని ఇప్పటికే సమాచారం అందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఖాళీ చేసిన దుకాణాలకు టెండర్ ప్రక్రియను నిర్వహించి అద్దె పెంచి దుకాణాలను అప్పగించి ఆదాయం సమకూర్చుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఖాళీ చేయని దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి, దుకాణాలను సీజ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో కుళాయి కనెక్షన్ల వివరాలు..

మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డుల్లో ప్రతీ ఇంటికి కులాయి కనెక్షన్ ఉండేలా బల్దియా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినా అవి పూర్తి స్థాయిలో రికార్డులకు ఎక్కలేదు. నూతనంగా ఇచ్చే కుళాయి కనెక్షన్‌ల విషయంలో గతంలో జరిగిన తప్పిదాలు జరగకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసి కుళాయి బిల్లు పూర్తిస్థాయిలో చెల్లించే విధంగా చర్యలు చేపడుతున్నారు. అలాగే గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు 100శాతం వసూలు చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారు. అధికారులు మున్సిపల్ ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికతో ముందుకు సాగితే బల్దియా ఆర్థికంగా బలోపేతమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి..

బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 500 దుకాణాలు మాత్రమే రికార్డుల్లో నమోదై ఉన్నాయని, నమోదు కాకుండా 300 నుంచి 500 వరకు దుకాణాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ దుకాణాలు బల్దియా రికార్డుల్లో నమోదు కాకుండా, ట్రేడ్ లైసెన్స్ లేకుండానే ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. అలాగే బల్దియా రికార్డుల్లో గతంలో ఇళ్లుగా నమోదై ప్రస్తుతం కమర్షియల్ దుకాణాలుగా కొనసాగుతున్నాయి. అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ దుకాణాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ట్రేడ్ లైసెన్స్ జారీ చేసి బల్దియాకు ఆదాయం సమకూర్చుకునే దిశగా అధికారులు చర్యలు చేడుతున్నారు. ఇలా చేస్తే బల్దియాకు భారీగా ఆదాయం సమకూరుతుంది.

దుకాణ సముదాయాలకు టెండర్లు..



బల్దియాకు ఆదాయం సమకూర్చే ప్రతీ విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్మించిన దుకాణ సముదాయాల లీజ్ గడువు ముగిసింది. అందుకే వాటిని ఖాళీ చేయించేందుకు సీజ్ చేశాం. యజమానులు దుకాణాలను ఖాళీ చేసిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, టెండర్లు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం. బల్దియాకు ప్రధాన ఆదాయ వనరు ప్రాపర్టీ టాక్స్‌ను పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు ముందుకు సాగుతున్నాం.

– వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్, బోధన్

అసంపూర్తిగా రోడ్డు పనులు



బోదేపల్లిలో నిలిచిన రహదారి పనులు



పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకం

- కంకర వేసి వదిలేసిన వైనం
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామం లోపలి వరకు తారు రోడ్డు వేయాల్సి ఉండగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో తారు రోడ్డు ఎప్పుడు వేస్తారు సారూ అంటు గ్రామస్తులు అడుగుతున్నారు. నిధులు మంజూరైనా పనులు పూర్తికాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

2023లో శంకుస్థాపన

లింకు రోడ్డు నుంచి గ్రామం లోపలి వరకు తారు రోడ్డు వేయుటకు 2023లో గత ప్రభుత్వం కోటి రూపాయల నిధులను మంజూరు చేసింది. అదే ఏడాది అప్పటి పాలకులు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సాధారణ ఎన్నికలకు ముందు రోడ్డు విస్తరణ కోసం తవ్వకాలు చేపట్టి కంకర వేశారు. అంతే అప్పటి నుంచి ఇప్పటి వరకు అటు వైపు కన్నెత్తి చూసే నాథుడే లేడు. దీంతో ఆ రోడ్డు గుండా రాకపోకలు నరకప్రాయంగా మారాయి. గత ప్రభుత్వంలో పనులు ప్రారంభం కాగా ప్రస్తుతం నూతన ప్రభుత్వం ఏర్పడటంతో పనులు పూర్తి చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి బాల్కొండ మండలంలో..

బాల్కొండ మండల కేంద్రం నుంచి కిసాన్‌నగర్ వరకు గల పాత జాతీయ రహదారి 44 రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగానే ఉంది. ముప్కాల్ మండలం రెంజర్ల నుంచి వన్నెల్(బి) వరకు గల రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే మెండోరా మండలం దూదిగాం నుంచి చాకీర్యాల్ వరకు వేయాల్సిన బీటీ రోడ్డుది ఇదే పరిస్థితి. మెండోరాలో రోడ్డు డివైడర్, రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలోనే చేపడుతాం..

అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. గత ప్రభుత్వంలో మంజూరైన కొన్ని రోడ్ల కోసం నిధులు రద్దయ్యాయి. అవసరం ఉన్న వాటిని ఒక్కొక్కటిగా పూర్తి చేయుటకు చర్యలు చేపడుతున్నాం.

– నాందేవ్, డీఈ, ఆర్అండ్‌బీ, బాల్కొండ

ప్రజాపాలన కరపత్రాల పంపిణీ





రెంజర్లలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. ఏర్గట్లలో..

బాల్కొండ: ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో కాంగ్రెస్ నాయకులు కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండ నెరవేర్చుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, ముత్యంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలంలో..

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలో ఆదివారం ప్రజాపాలన కరపత్రాలను కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని వారు పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, నాయకులు జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

రెంజల్(బోధన్): వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మండల సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించి, యువతకు ఎలాంటి బ్యాంకు పూచీకత్తులు లేకుండా స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేయాలన్నారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం బాధకరమన్నారు. బండ క్వారీలు, క్రషర్లపై వడ్డెరలకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వడ్డెర కులస్తుల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం స్పందించి నెరవేర్చాలన్నారు. నాయకులు ఎత్తరి సాయిలు, ఆటో శేఖర్, మార్ల అంజి, ముద్దంగులు గిరిలు పేర్కొన్నారు.

మండలస్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి



నందిపేటలో మాట్లాడుతున్న ట్రస్మా ప్రతినిధులు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో సోమవారం నుంచి జరిగే మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ట్రస్మా అధ్యక్షుడు చుక్కబొట్ల దేవన్న తెలిపారు. నందిపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా ఒలంపిక్, అథ్లెటిక్ అసోషియేషన్ సౌజన్యంతో మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం నుంచి నిర్వహించబడుతాయన్నారు. ప్రారంభ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులతో పాటు ట్రస్మా జిల్లా బాధ్యులు, నాయకులు పాల్గొంటారన్నారు. ట్రస్మ ప్రతినిదులు సన్ని, అరుణ్, అథ్లెటిక్ అసోషియేషన్ ప్రతినిదులు రాజుగౌడ్, కపిల్, నాగారావు, చిన్నరెడ్డి, సత్యనారాయణ, పురుషోత్తంరెడ్డిలు పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో భాగస్వామ్యం ఉండాలి



నందిపేట్ (ఆర్మూర్): ప్రస్తుత సమాజంలో పద్మశాలీలకు రాజ్యాధికారం లేకుంటే విలువ లేదని, మనకు భాగస్వామ్యం ఉండాలని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన గ్రామ పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ పడలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 55,000 ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. కుల గణన చేయిస్తుందని, బీసీలకు రిజర్వేషన్లు పెరుగుతాయని అన్నారు. అనంతరం అయిలాపూర్ పద్మశాలి సంఘ అధ్యక్షుడు అవధూత నర్సయ్య, పద్మశాలి కులస్తులు ఆయనను సన్మానించి, జ్ఞాపికను అందించారు. సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏ(మేల్) పోస్టులను భర్తీ చేయాలి



నిజామాబాద్ నాగారం: వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఎంపీహెచ్ఏ) పురుష పోస్టులను భర్తీ చేయాలని ఎంపీహెచ్ఏ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఆదివారం జిల్లాకు చెందిన నాయకులు హైదరాబాద్‌లోని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంపీహెచ్ఏ (పురుష) కోర్సును పూర్తి చేసుకుని చాలా సంవత్సరాలుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వేసిన ఎన్నో నోటిఫికేషన్లలో తమకు అవకాశం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఇటీవల వేసిన నోటిఫికేషన్‌లో సైతం తమకు సంబంధించిన పోస్టులను ప్రతిపాదించకుండా అన్యాయం చేశారని, న్యాయం చేయాలని కోరారు. నాయకులు ప్రశాంత్, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మంచి పాలన అందించాలి



రుద్రూర్: ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్‌లు మంచి పాలన అందించాలని, ఈ ఉద్దేశంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్లు అమ్మ, నాన్న సేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసుబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సర్పంచ్ చేయాల్సిన కార్యక్రమాలకు సంబంధించి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్‌లు తోట శంకర్, జమీల్ పటేల్, మాజీ వార్డు సభ్యుడు మేక వెంకటేశ్వర రావ్, రెడ్‌క్రాస్ సభ్యుడు సుధీర్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శాంతి కుమారి ఆదివారం తెలిపారు. విద్యార్థినులు రసజ్ఞ, గంగోత్రి ప్రదర్శించిన ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందుతూ.. రాష్ట్రస్థాయి పోటీలకు సెలెక్ట్ కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయురాలు గైడ్ స్వరూప, విద్యార్థులను అభినందించారు.

నవీపేట్ మండలంలో..



నవీపేట్: మండలకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికై ందని పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని ఇందుప్రియ, గైడ్ టీచర్ శరత్‌ను ఎంఈవో అశోక్, హన్మాండ్లు అభినందించారు

■ నెట్‌బాల్ పోటీలకు..



మాక్లూర్: మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఆదివారం బయలుదేరినట్లు పీడీ కవిత తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు శ్రీవర్ష, హర్షిత్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు.

స్మైల్ పాఠశాలకు అవార్డు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్మైల్ స్కూల్ బెస్ట్ టాప్20 ప్రీస్కూల్‌లో ఒకటిగా అవార్డును దక్కించుకుంది. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన ఆల్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాఠశాల డైరెక్టర్ రఫిగౌహర్‌కు బ్రెయిన్ ఫీడ్ మ్యాగజిన్ సంస్థ ప్రతినిధులు బ్రాహ్మం, ప్రసాద్ అవార్డును అందజేశారు.

రిటైర్డ్ గుమాస్తాల సమావేశం

నిజామాబాద్ నాగారం: నగరంలోని కేర్ డిగ్రీకళాశాల ఆవరణలో ఆదివారం నిజామాబాద్ బట్టల దుకాణాల రిటైర్డ్ గుమాస్తాల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు జాడే సంతోష్ మాట్లాడుతూ.. పలు అంశాలపై చర్చించారు. సంఘంలోని చాలామంది సభ్యులు సొంత ఇల్లు లేని వారు ఉన్నారన్నారు. వారికి ఇంటి స్థలాల కోసం ప్రజాప్రతినిధులతో మాట్లాడుదామన్నారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం మాదిగ జేఏసీ జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జిగా మోతే భూమన్న, జిల్లా అధికార ప్రతినిధిగా మల్లాని శివ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉంగరాల రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోయిని జోసఫ్, ఉపాధ్యక్షులుగా దేవయ్య, కనక ప్రకాష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నరేష్ రాములు, పోశెట్టి చిరంజీవి, రాజేష్, ప్రభాకర్, మహిళా విభాగం కన్వీనర్‌గా లతా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ తర్వాత గ్రామ కమిటీలు, మండల కమిటీలను నియోజకవర్గస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని శ్రీనివాస్ తెలిపారు.

ఆధ్యాత్మికం..

■ భక్తిశ్రద్ధలతో ఆదిమల్లన్న జాతర



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ఆదివారం ఆదిమల్లన్న జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్దంగా పూజలు నిర్వహించారు. బలిహరణం తర్వాత రథోత్సవం నిర్వహించారు. వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు అలరించాయి.

■ మల్లన్నకు అన్వేష్‌రెడ్డి పూజలు



వేల్పూర్: మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో గల కొమురెల్లి మల్లన్నకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం జరుగనున్న జాతర కోసం గ్రామంలో రథాన్ని సిద్ధం చేశారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, సొసైటి డైరెక్టర్ జి.నర్సారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)
- స్క్రీన్-2 – పుష్ప-2(తెలుగు) - 10.15 2.20 6.25 10.30
- స్క్రీన్-3 – పుష్ప-2(తెలుగు) - 9.30 1.35 5.40 9.45
- స్క్రీన్-4 – పుష్ప-2(తెలుగు) -2.05 6.10

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 పుష్ప-2(తెలుగు)-10.15, 2.00,6.00,10.00
- స్క్రీన్-2 పుష్ప-2(తెలుగు)-1.00,4.45,9.10
- స్క్రీన్-3 పుష్ప-2-11.00,3.10,7.00,10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25,10.30
- స్క్రీన్-2 పుష్ప-2(తెలుగు)-9.30,1.35, .5.40, 9.45
- స్క్రీన్-3 పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15
- స్క్రీన్ -4 పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20

లలితామహల్	కేసీఆర్(తెలుగు)
దేవి	పుష్ప-2(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,800	వెండి(కిలో)	95,200
22 క్యారెట్స్	72,705		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800